పూడూరు మండలం దామగుండం ఫారెస్టును సందర్శించిన సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్

అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలి

రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ప్రియాంక వర్గీస్

పూడూరు, నవంబర్ 30: దామగుండం అడవిలో జరిగిన అగ్ని ప్రమాదం మరోసారి జరుగకుండా చూసుకోవాలని రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్)అధికారి ప్రియాంక వర్గీస్ పేర్కొన్నారు. శనివారం పూడూరు మండలం దామగుండం ఫారెస్ట్‌ను సందర్శించి గురువారం జరిగిన అగ్ని ప్రమాదంపై వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దామగుండం అడవిలోని 2900 ఎకరాల భూమిలో నేవీ రాడర్ సిగ్నల్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వివరించారు. అడవికి నిప్పంటుకోవడంతో పెద్ద పెద్ద వృక్షాలతోపాటు పలు జంతువులు మృతి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఫారెస్ట్ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నేవీ అధికారులు ఏ ప్రాంతంలో నిర్మాణాలు చేస్తారనే విషయం మ్యాప్ ద్వారా స్థల పరిశీలన చేశారు. నేవీ అధికారులు నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణ ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. జరిగిన అగ్ని ప్రమాదంపై పూర్తి విచారణ జరపాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. వీరితోపాటు జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, డివిజన్ ఫారెస్ట్ అధికారి శ్యామ్‌కుమార్, అరుణ, నేవీ శాఖ ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'కొండకల్' వ్యవహారంపై

సమగ్ర విచారణ జరిపిస్తాం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

కలెక్టర్ కార్యాలయంలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 30(నమస్తేతెలంగాణ): శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామంలో గిరిజనుల భూముల వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి నివేదికను ఎస్టీ కమిషన్‌ను అందజేస్తామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కొండకల్ గ్రామానికి చెందిన రైతులతో ఆయన విడివిడిగా చర్చలు జరిపారు. కొండకల్ గ్రామంలోని సర్వే నంబర్ -352, 362, 363, 364, 377లోని భూములు రక్షిత కౌలుదారుల ఆధీనంలో ఉన్నాయని, ఎన్నో ఏండ్లుగా ఈ భూములను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామంలో పెద్ద మనిషిగా చలామణి అవుతూ.. గిరిజనులను భయపెట్టి, అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడని, ఈ విషయాన్ని అడగటానికి వెళ్లిన గిరిజనులపై కేసులు పెట్టిస్తున్నారని, జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు, లంబాడీ హక్కుల పోరాట సమితిలు రైతులతో కలిసి జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్టీ కమిషన్ సమగ్ర విచారణ జరిపి తమకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే, గిరిజనుల భూములు కొనుగోలు చేసిన అపర్ణ సంస్థపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల ఆదేశాల మేరకు విచారణ జరిపిన కలెక్టర్ కొండకల్ గ్రామంలో ఎలాంటి ఆందోళనలు, దౌర్జన్యాలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు వచ్చిన వారందరినీ గౌరవించాలి

జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 30: ఫిర్యాదు కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికి సమాన గౌరవం అందించాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఇటీవల పాసింగ్ ఔట్ పరేడ్ పూర్తి చేసుకొని జిల్లాలో రిపోర్ట్ చేసి, విధుల్లో చేరిన నూతన పోలీస్ కానిస్టేబుల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ ట్రైనింగ్‌లో నేర్చుకున్న విధంగా ప్రతి ఒక్కరూ విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో, సమయపాలన పాటిస్తూ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు ఎవరు వచ్చినా ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా చూడాలని, ఎల్లప్పుడు ప్రజలతో స్నేహ భావంగా ఉండాలని తెలిపారు. మంచి అలవాట్లను నేర్చుకొని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శారీరక దృఢత్వం పైన ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. జిల్లాకు, తెలంగాణ రాష్ట్ర పోలీస్‌కు మంచి పేరు వచ్చేలా పనిచేయాలని సూచించారు. జిల్లాలో సివిల్ 28 మంది, ఏఆర్ 66, కమ్యూనికేషన్ 3 మొత్తం 97 మంది రిపోర్ట్ చేసి విధుల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఏవో జ్యోతిర్మని, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్య, వైద్యం, ఇల్లు ఇవ్వాలి

డీఎస్పీ రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్ రమేశ్

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్ రమేశ్

ఆమనగల్లు, నవంబర్ 30: రాష్ట్రంలో ఉన్న అణగారిన వర్గాలైన పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అందించాలని డీఎస్పీ రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వంకేశ్వరం రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు పలు డిమాండ్లు నెరవేర్చాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్ వంకేశ్వరం రమేశ్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 90శాతానికిపైన పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వంటి ప్రధాన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాలపై దృష్టి సారించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ మండల నాయకులు బలరాం, జగన్, హరి, ప్రవీణ్, యాదగిరి, మహేశ్, గోపాల్‌నాయక్, పరమేశ్వర్, శ్రీశైలం, శివ, జంగయ్య ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న

మొయినాబాద్/కొత్తూరు, నవంబర్ 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న అన్నారు. శనివారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర వసతి గృహాన్ని, పాఠశాలను మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం వెనుకాల ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శంకర్‌పల్లి బాలికల గురుకుల పాఠశాలను, వసతి గృహాన్ని, అజీజ్‌నగర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు పెడుతున్న భోజనంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంతో పాటు వసతి గృహాల్లో పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. వసతి గృహాల్లో భోజన శాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేస్తే ఆరోగ్యంగా ఉండటంతో పాటు చక్కగా చదువుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆమెతో పాటు జిల్లా విద్యాధికారి సుశీందర్, డీఐఈఓ వెంకాన్యానాయక్, మండల విద్యాధికారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లోని చిలుకూరు గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులు తింటున్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న

బూస్టర్ డోసులపై నిర్లక్ష్యం చేయొద్దు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్‌రమణ

సమావేశానికి హాజరైన వైద్యాధికారుల, సిబ్బంది

వికారాబాద్, నవంబర్ 30: ఏడాది లోపు చిన్నారులకు టీకాలు వేయడంతో పాటు 5, 10, 16 ఏండ్ల వయస్సు గల పిల్లలకు వేయాల్సిన బూస్టర్ డోసులను కూడా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరికి టీకాలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో కొత్తగా చేర్చబోయే వ్యాక్సిన్‌ల గురించి, ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడం, పర్యవేక్షించడం కోసం ఉద్యోగులకు, సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది, పర్యవేక్షకులు వారి వారి పరిధిలో ఉన్న చిన్నారుల సంఖ్యను మదింపు చేసుకొని ఏ ఒక్కరూ మిస్ కాకుండా టీకాలు వేయాలన్నారు. సంవత్సరం లోపు చిన్నారులకు టీకాలు వేయడమే కాకుండా 18 నెలలు, 5, 10, 16 సంవత్సరాల వయస్సుల్లో వేయాల్సిన బూస్టర్ డోసులు కూడా తప్పనిసరిగా వేయాలని సూచించారు. అందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టీకా వేసిన అనంతరం చిన్నారులకు చిన్న చిన్న సమస్యలు ఏర్పడినట్లయితే వాటి నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాక్సినేషన్ అనంతరం సిరంజీలను ఇతర వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాల ప్రకారం భద్రపరిచి నిర్మూలించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ లను సరైన టెంపరేచర్‌లో, క్రమ పద్ధతిలో నిల్వ ఉంచాలని, వ్యాక్సినేషన్ అనంతరం తల్లిదండ్రులకు తరువాత డోసుకు పిల్లలను తీసుకురావాల్సిన తేదీని తెలిపి, ఇమ్యూనైజేషన్ కార్డులో తప్పక నమోదు చేయాలని సూచించారు. ఇమ్యూనైజేషన్ తీసుకోకుండా ఉన్న చిన్నారులను గుర్తించడం కోసం ఇంటింటి సర్వే చేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో దూరంగా తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్న ప్రాంతాల్లో, ఇటుక బట్టీల ప్రాంతాల్లో, కంకర క్రషెర్ ప్రాంతాల్లో, సంచార జాతులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి ఏ ఒక్క చిన్నారి మిస్ కాకుండా వ్యాక్సినేషన్ జరిగేలా జాగ్రత్త వహించాలని తెలిపారు. ప్రతి మహిళా ఆరోగ్య కార్యకర్త దగ్గర వారి పరిధిలో వ్యాక్సినేషన్ వేయాల్సిన చిన్నారుల సంఖ్య, వివరాలు కచ్చితంగా నమోదు చేసుకుని ఉండాలన్నారు. ప్రతి నెల టీకా వేసిన అనంతరం వాటిని అప్డేట్ చేయాలని సూచించారు. వ్యాక్సినేషన్ సెషన్ అనంతరం టీకాలు పొందిన పిల్లల వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని తెలిపారు. శిక్షణా కార్యక్రమం రాష్ట్ర కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా వచ్చిన యూనిసెఫ్ కన్సల్టెంట్ డాక్టర్ మురారి, వైద్యులు జ్యోత్స్న, డేవిడ్, శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో బస్సులు.. ప్రజల ఇబ్బందులు

- **దుమ్ముధూళితో అవస్థలు పడుతున్న దుకాణదారులు**
- **పట్టించుకోని ఆర్టీసీ అధికారులు**

ఇబ్రహీంపట్నం రూరల్, నవంబర్ 30: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ ప్రైవేటు బస్సుల రాంగ్‌రూట్ ప్రయాణంతో సాగర్ రహదారిపై ప్రయాణికులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం ప్రైవేటు బస్సులకు సంబంధించిన షెల్టర్ ఫై షోరూం ఎదురుగా ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం, ఉదయం సమయాల్లో ఈ బస్సులు రోడ్డెక్కాలంటే సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న డివైడర్ వద్దకు రాంగ్‌రూట్‌లో సాగర్ రహదారిపై బస్సులు వస్తుండటంతో ఎదురుగా వచ్చే ప్రయాణికులతోపాటు రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎలిమినేడు రోడ్డులోని శాస్త్రాగార్డెన్ దగ్గర నుంచి బస్సులు ప్రయాణించేందుకు డివైడర్ కటింగ్ ఉన్నప్పటికీ ఆర్టీసీ ప్రైవేటు బస్సు డ్రైవర్లు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రాంగ్‌రూట్‌లో బస్సులను రోడ్డుపైకి తీసుకువస్తున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు సమాచారమిచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని దుకాణదారులు, పలువురు ప్రయాణీకులు వాపోతున్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చే బస్సులతో దుకాణాల్లో దుమ్ముధూళి నిండిపోతుందని, ఎదురుగా వచ్చే ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రైవేటు బస్సుల డ్రైవర్లకు అవగాహన కల్పించి ఇబ్బంది తొలగించాలని కోరుతున్నారు.

సాగర్ రహదారిపై రాంగ్‌రూట్‌లో వస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్న ఆర్టీసీ ప్రైవేటు బస్సులు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

సాగర్ రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న షెల్టర్‌లో నుంచి ఆర్టీసీ ప్రైవేటు బస్సులు రాంగ్‌రూట్‌లో వస్తుండటంతో ఎదురుగా వచ్చే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కన దుకాణాల ముందు నుంచి వెళ్తుండటంతో దుకాణాల్లో దుమ్ము నిండిపోతున్నది. ఈ విషయమై పలుమార్లు డీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వెంటనే ప్రైవేటు బస్సుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నాం.

– బాగారెడ్డి, దుకాణదారుడు

ఫంక్షన్ హాళ్లే వాళ్ల టార్గెట్

- **బంగారం నగల దొంగల ముఠా గుట్టు రట్టు**
- **ఒక్కరి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు దొంగలు**
- **38 తులాల బంగారు నగలు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి**

ఆదిబట్ల, నవంబర్ 30: చిన్న చిన్న దొంగతనాలు చేస్తే లాభం లేదు అనుకున్న ఓ ముఠా ఏకంగా ఫంక్షన్‌హాళ్లలో బంగారు నగలు దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ ముఠా పెద్ద వారు దొంగతనాలకు పాల్పడితే గుర్తు పడుతారని చిన్న పిల్లలతో బంగారు నగలు దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలతో పాటు ఓ కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు.

తెలంగాణాలో తీగ లాగితే కర్ణాటకలో కదిలిన డొంక

మధ్యప్రదేశ్ రాష్ట్రం, రాజ్‌గడ్ జిల్లా, గుల్జేడి గ్రామానికి చెందిన అరుడ, మరో ఇద్దరు నిందితులు సొంత అన్న తమ్ముళ్లు రిషి, అభిషేక్‌లు. వీరు ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. వీరంతా తమ గ్రామం గుల్జేడిలో చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరు రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో దొంగతనాలు చేసి జైల్‌కు వెళ్లారు. తిరిగి జైల్ నుంచి వచ్చిన తరువాత చిన్నచిన్న దొంగతనాలు చేస్తే లాభంలేదని ఒకేసారి పెద్ద దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలని అనుకున్నారు. వారు ఫంక్షన్‌హాళ్లను ఎంచుకుని ఫంక్షన్‌హాల్‌లలో స్టేజీ మీద, భోజనాలు చేసే దగ్గర హడావుడిలో ఆడవారు హ్యాండ్ బ్యాగ్‌లను వదిలివెళ్లగా అదును చూసి ఆ బ్యాగులను కొట్టివేయాలనే పథకం వేసుకున్నారు. పెద్ద వారు దొంగతనాలు చేస్తే గుర్తు పడుతారనే నేపంతో ప్రధాన నిందితుడు అరుడ యొక్క మరుదలు కొడుకు(12) కలిగిన బాల నేరస్తుడిని రంగంలోకి దించారు. వీరు ఓ కారును కిరాయికి తీసుకుని మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. విజయవాడ, నాగార్జునసాగర్ రోడ్డులోని ఫంక్షన్ హాళ్లలో ఎక్కడ ఫంక్షన్‌లు జరిగితే అక్కడ దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ నెల 14న ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ట్రాంకుల్ రిసార్ట్‌లో నగరంలోని ఎల్ఎన్ఎస్ రెసిడెన్సీ, కర్మన్‌ఘాట్‌కు చెందిన పారేపల్లి నర్సింహ కూతురు వివాహం జరుగుతుంది. దీనిని గమనించిన ఈ ముఠా ఆ రిసార్ట్ వద్దకు వచ్చారు. అరుడ, రిషి, అభిషేక్‌లు రిసార్ట్ బయట ఉండి 12 సంవత్సరాల బాల నేరస్తుడిని లోపలికి పంపించారు. పారేపల్లి నర్సింహ భార్య అనిత నగలు, డబ్బు ఉన్న బ్యాగ్‌తో స్టేజీ మీద ఉండగా వారు గమనించారు. ఆమె ఆ బ్యాగును పెండ్లి జరుగుతుండగా అందులో 18 తులాల బంగారు నగలు, 40వేల నగదు, ఓ సెల్‌ఫోన్ ఉన్న బ్యాగును పక్కన పెట్టి పక్కకు వెళ్లింది. అదే అదునుగా భావించిన ఆ బాలుడు ఆ బ్యాగును దొంగిలించి తీసుకుని రిసార్ట్ నుంచి బయటకు వచ్చి అరుడ, రిషి, అభిషేక్‌లకు ఇచ్చాడు. దీంతో అందరూ కలిసి విజయవాడ హైవే రోడ్డు వైపు వెళ్లి ఆ బ్యాగులో ఉన్న బంగారు నగలు, నగదును తీసుకుని బ్యాగ్ సెల్ ఫోన్‌ను రోడ్డు పక్కన పడేసి వెళ్లారు. దీంతో బాధితుడు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వీరిని సాగర్ హైవే రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకోవడానికి ప్రయత్నించగా.. నిందితులు రిషి, అభిషేక్‌లు కర్నాటక రాష్ట్రంలో దొంగతనం చేసిన వారి వాటాకు వచ్చిన బంగారంతో పారి పోయారు. మరో నిందితుడు అరుడ, బాల నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 38 తులాల బంగారు నగలు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కర్నాటకలోని టిప్ తూర్ టౌన్ పోలీస్‌స్టేషన పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

అభినందించిన డీసీపీ

బంగారం దొంగల కేసు విషయంలో ఎంతో చాకచక్యంగా నేరస్తులను పట్టుకొని వారి వద్ద నుంచి బాధితులు పోగొట్టుకున్న 38 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకోవడంలో ముఖ్యపాత్ర పోషించిన ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, రాజు, నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ గిరి, ఉపేందర్, రెడ్డి, సంతోశ్, శివచంద్ర, కృష్ణ, రవీందర్, సందీప్‌లను డీసీపీ సునీతారెడ్డి అభినందించి వారికి క్యాష్ రివార్డు అందజేశారు. డిపార్ట్‌మెంట్ నుంచి రివార్డ్‌కు సిఫారసు చేశారు.

బంగారు ఆభరణాల దొంగను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తదితరులు

'విదేశీ విద్యానిధి'కి దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా అధికారి హనుమంతరావు

వికారాబాద్, నవంబర్ 30: తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గ సంక్షేమశాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించదల్చిన పేద మైనార్టీ(ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు బౌద్ధులు, పారసీలు) విద్యార్థులకు 'ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం' (chief minister's overs eas scholarship scheme for mino rities 2024) ఫాల్ సీజన్ 2024 కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యా క వర్గాల అధికారి కె.హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపథకం ద్వారా పేద మైనార్టీలకు రూ.20 లక్షలు ఉపకార వేతనం, ఒక వైపు విమాన రవాణా ఖర్చుల కింద రూ.60వేల వరకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డిగ్రీ(ఇంజినీరింగ్)లో 60% మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయుటకు, పీ.హెచ్.డీ చేయాలనుకునే వారు పీజీలో 60% మార్కులు పొందినవారు అర్హులన్నారు. ఆగష్టు-2024 నుంచి-డిసెంబర్-2024 మధ్య కాలములో విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొంది ఉన్న మైనార్టీ విద్యార్థులు పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. https://telanganaepass.cgg.gov.in/ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేయుటకు డిసెంబర్ 1 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హార్డ్‌కాపీలు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయము, కలెక్టర్ కార్యాలయం రూమ్-17 వికారాబాద్‌లో సమర్పించడానికి 2025 జనవరి 10 ఆఖరు తేదీ అన్నారు.

ఆర్ఎస్పీపై మంత్రి సురేఖ ఆరోపణలు చేయడం సిగ్గుచేటు

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తొండుపల్లి రాజమహేంద్ర వర్మ

మొయినాబాద్, నవంబర్ 30: పేద ప్రజల బిడ్డల ఉన్నత భవిష్యత్ కోసం ఆహర్నిశలు కృషి చేసిన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అని బీఆర్ఎస్ జిల్లా నాయకులు తొండుపల్లి రాజమహేంద్రవర్మ అన్నారు. గురుకుల విద్యార్థులపై కుట్ర చేసి విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విషపూరిత ఆహారం తినిపిస్తున్నాడని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను శనివారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ఐపీఎస్ అధికారిగా ఉద్యోగం పొందిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై చక్కగా చదువు సంధ్యలేని మంత్రి సురేఖ ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విష సంస్కృతిని ఆర్ఎస్పీ మీద పూయడం మంచిది కాదని మండిపడ్డారు. ప్రవీణ్‌కుమార్ మీద చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో తమ వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టాల్సి ఉంటుందన్నారు.

విద్య బలోపేతానికి భారతీయ శిక్షా బోర్డు

మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ఉత్తమ బోర్డు అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, నవంబర్ 30: విద్యా సంస్థల నిర్వహణ, బలోపేతం కోసమే భారతీయ శిక్షా బోర్డు(బీఎస్‌బీ) ఏర్పడిందని తెలంగాణ రాష్ట్ర ఉత్తమ బోర్డు అధికారి పోచారం వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని రత్నారెడ్డి గార్డెన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పతంజలి ఫౌండేషన్ యోగా గురువు రాందేవ్ బాబా చిన్నారులకు రామాయణం, మహాభారతం, భగవద్గీత తదితర వాటిపై అవగాహన పెంచేందుకే భారతీయ శిక్షా బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, నవోదయ, సైనిక్ స్కూల్స్, రైల్వే పాఠశాలలు, మిలిటరీ సంస్థలచే నిర్వహించే పాఠశాలలు, వివిధ సంస్థలచే నడిపే గురుకుల పాఠశాలలు, సామాజిక, ఆధ్యాత్మిక సంస్థలచే నడిపే అన్ని ప్రైవేటు పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన పాఠ్య పుస్తకాలు, తక్కువ ధరకే అందించడం జరుగుతుందని తెలిపారు. శిశు, ఎల్‌కేజీ